చలివేంద్రం ప్రారంభం



మియాపూర్: వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడుతాయని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మియాపూర్‌లోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్ వద్ద ఎలమంచి ఉదయ్ కిరణ్ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఆయన కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, చారిట్రబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



రాయదుర్గం: రాయదుర్గంలోని శ్యామ్‌లేటవీధిలో ఊరపోచమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి ఆదివారం అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

కొమరగౌని శంకర్‌గౌడ్‌కు ఘన నివాళి



కొమరగౌని శంకర్‌గౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న రవికుమార్‌యాదవ్, సురేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్

రాయదుర్గం: శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు కొమరగౌని శంకర్‌గౌడ్‌కు స్థానిక నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఖాజాగూడలో ఆయన గృహంలో ఏర్పాటు చేసిన పెద్ద కర్మ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్‌తోపాటు పెద్ద సంఖ్యలో వివిధ పార్టీల నాయకులు, సన్నిహితులు, స్నేహితులు, వ్యాపార, వాణిజ్యవేత్తలు, బంధువులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దయావతి, లక్ష్మమ్మ, వెంకటేష్‌గౌడ్, సురేష్‌గౌడ్, గణేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విరమించేంత వరకూ పోరాడుతాం

డంపింగ్‌యార్డ్‌కు వ్యతిరేకంగా జేఏసీ నిరసనలు



జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 75వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం గ్రామానికి చెందిన యువకులు, గ్రామస్తులు, మహిళలు, దివ్యాంగులు నల్లవల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రిలేనిరాహార దీక్షలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం డంపింగ్‌యార్డ్ ఏర్పాటును విరమించేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విషవాయువుల నుంచి కాపాడండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని తరచూ పరిశ్రమలు వెదజల్లుతున్న విషవాయువుల నుంచి తమను కాపాడాలని నవ్యది గ్రాండ్ కాలనీ వాసులు ఆదివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి విషవాయువులతో తామంతా తీవ్రంగా ఇబ్బంది పడ్డామని..వారంలో ఒకసారి ఇదేవిధంగా జరుగుతోందని వివరించారు. చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి వారికి ఫిర్యాదు చేసినా ఫలితంలేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ప్రజావాణి కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

నాడు అపరిశుభ్రం..
నేడు ఆకర్షణీయం

రూపురేఖలు మారిపోయిన బర్లకుంట చెరువు | సహకారమందించిన విద్యార్థులు



2024లో గచ్చిబౌలిలోని బర్లకుంట చెరువు పరిస్థితి



రాయదుర్గం: ఏడాది క్రితం వరకు ఆ చెరువులో మురుగునీరు, గుర్రపుడెక్క మాత్రమే ఉండేవి. ఇపుడు చెరువు రూపురేఖలే మారిపోయి ఆకర్షణీయమైన ప్రాంతంగా మారింది. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల చొరవతో 'ధృవాంశ్' స్వచ్ఛంద ఎన్‌జీఓ సంస్థ గచ్చిబౌలిలోని బర్లకుంట ను దత్తత తీసుకొని ఏడాదిలో సుందరంగా మార్చేసింది. అదే బర్లకుంట చెరువు. నాలుగు ఎకరాల్లో విస్తరించి ఉన్న బర్లకుంట చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, 20 లైట్లను ఏర్పాటు చేయడంతో మరింత ఆకర్షణీయంగా మారింది.

మొత్తం 16వేల మొక్కలు

ఏడాది క్రితం బర్లకుంట పరిసరాలు అపరిశుభ్రంగా ఉండేవి. బర్లకుంట ప్రాంతంలో గ్రీనరీ పెంపునకు ధృవాంశ్ సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంది. అందులోభాగంగా చుట్టూ ఆకట్టుకునేలా రకరకాల 10వేల మొక్కలు నాటి వాటిని పెంచుతున్నారు. అంతేకాకుండా చెరువులోని నీటిని శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవడంతో కుంట మధ్యలో తేలియాడేలా 'వెట్ ఫ్లోటింగ్ ట్రీట్‌మెంట్ వెట్‌ల్యాండ్' పేరిట 6వేల మొక్కలు నాటి కుంట లో తేలియాడేలా మార్చి ఆకట్టుకునేలా చేశారు. ముఖ్యంగా 10వేల మొక్కలలో అశ్వగంధి, తులసి, జట్రోప, కేలా, మందార, జూలామాత్రిపత్రి, దోమల నివారణ మొక్కలు, హర్‌సింగార్, ఇన్సూలిన్ మొక్కలు, సింధూరి వంటి వాటిని ఏర్పాటు చేశారు. స్థానిక పాఠశాలలు, కళాశాలలు, ఐఐటీ హైదరాబాద్ విద్యార్థుల సహకారంతో క్లీనప్ డ్రైవ్ కార్యక్రమం ఏర్పాటు చేయించారు. అలాగే మురుగు నీరు చేరకుండా చర్యలు చేపట్టారు.



'వెట్ ఫ్లోటింగ్ ట్రీట్‌మెంట్‌వెట్‌ల్యాండ్' పద్ధతిలో మొక్కలు నాటి పెంచుతున్న దృశ్యం



క్లీనప్‌డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థులు(ఫైల్)



పెయింటింగ్ వేస్తున్న విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు..(ఫైల్)

మరింత అందంగా మారుస్తాం



బర్లకుంటను 2026 వరకు దత్తత కొనసాగిస్తాం. ఈ కుంట నిర్వహణ సమస్యగా మారింది. నగరంలోనే మోడల్ లేక్‌గా మార్చాం. జీహెచ్‌ఎంసీ, హైడ్రా చొరవ తీసుకొని నామమాత్ర రుసుము వసూలు చేసే అనుమతి ఇస్తే మరింత ఆకర్షణీయంగా మార్చేలా అవకాశం కల్పించాలని యోచిస్తున్నాం.

– మధులికాచౌదరి, సీఈఓ ధృవాంశ్ స్వచ్ఛంద ఎన్‌జీఓ సంస్థ

ప్రసాద్ సేవలు మరువలేనివి : సీపీఎం

అల్విన్‌కాలనీ: పెన్షనర్ల సంఘం నాయకులు ఎల్.డీ. ప్రసాద్ శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య, సీపీఎం నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం హైదర్‌నగర్ శాఖ కార్యదర్శి శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రసాద్ హెచ్‌ఎంటీలో పని చేస్తున్న సమయంలో కార్మిక ఉద్యమంలో చురుగ్గా పని చేశారన్నారు. ఎల్.డి. ప్రసాద్ నేత్ర దానం చేయటం ఆదర్శమన్నారు. సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డి.జి. నరసింహారావు, జిల్లా కార్యదర్శి పి. సత్యం, జనార్దన్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఆర్. వరప్రసాద్, సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్, బాచుపల్లి మండల కార్యదర్శి బి. వెంకటరామయ్య, అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ రెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ అవిశ్రాంత పోరు



సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం

మణికొండ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ పార్టీ అవిశ్రాంత పోరాటం చేస్తుందని ఆ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆదివారం ల్యాంకోహిల్స్ పరిధిలోని ఏఎస్‌బీఎల్ లేక్ సైడ్ టవర్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రహదారులలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. సైన్ బోర్డులు పెట్టి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. పరిష్కార మార్గంలో ల్యాంకో హిల్స్ నుంచి సాయికృప వారు వేసిన లేఔట్ ప్రకారం హైటెన్షన్ వైర్ల కింద పద్మనాభ స్వామి ఆలయం వెళ్లడానికి అనువుగా ఏర్పాటు చేసిన పాత రహదారి మార్గ సూచికలు ఉన్నాయని ఫెన్సింగ్ వేసి రహదారి మూసివేశారన్నారు. ఫెన్సింగ్ తొలగించి ప్రజల సౌకర్యార్థం రహదారిని కొనసాగించాలన్నారు. మున్సిపాలిటీ వారు ఒక వైపు రిజిస్ట్రేషన్ అధికారులు, మరో వైపు ఒక ప్లాట్‌కు ఆస్తిపన్ను ఇద్దరికీ కట్టమని ఒత్తిడి చేస్తున్నారన్నారు. రహదారి వీధి దీపాలు లేనందున నిర్మానుషంగా ఉన్న స్థలంలో రాత్రి కాగానే కొంత మంది మత్తు పానీయాలు సేవించిన తరువాత పెద్దగా అల్లర్లు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు. అపార్ట్‌మెంట్ వెనుక ఉన్న ఖాజాగూడ సరస్సు కొద్ది కొద్దిగా కబ్జాకు గురవుతుందని దీనిని కాపాడాలన్నారు. కార్యక్రమంలో నేతలు కృష్ణ, శ్రీధర్‌నాయుడు, ప్రశాంత్, శ్రీధర్, జైరామ్, నరేష్, కోటిరెడ్డి, సురేష్, శ్రీకాంత్, శివ, రాణా, శ్రీనాథ్‌రెడ్డి, సిద్దేశ్వర్, రవీందర్, బాబు, రఘు ఉయ్యాల, రమణరెడ్డి, కృష్ణ, ఆశా, శాంతి, విశ్వజిత్, సచిన్‌లతో పాటు గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, సంగం శ్రీకాంత్, కోడిచెర్ల దేవేందర్, యాలాల కిరణ్, భానుచందర్, జైరామ్, సుమనళిని, షేక్ ఆరిఫ్, చెరుకూరి బాలాజీ, రమణమూర్తి, యాలాల బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నానని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆదివారం రామచంద్రాపురంలోని స్నేహ లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి వారు ఆయనను ఘనంగా సన్మానించారు. తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. తమకు ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వని కారణంగా మంజీరా నీరు రావడం లేదని అపార్ట్‌మెంట్‌వాసులు ఆయనకు వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్ వాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో జీహెచ్‌ఎంసీ అధికారుల వద్దకు స్వయంగా వెళ్లి సమస్యను వివరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో భోగయ్య, గుండం మోహన్ రెడ్డి, బాలమనోహర్, రామకృష్ణ, సజీవ్‌నాయర్, మధుసూదన్ రెడ్డి, జ్ఞానేశ్వరి, కల్పన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రఘునందన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

కార్పొరేట్ శక్తులకే అనుకూలం

సీఐటీయూ అఖిలభారత కోశాధికారి సాయిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ అఖిలభారత కోశాధికారి సాయిబాబు

పటాన్‌చెరు: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఆర్థిక విధానాలను అవలంబిస్తోందని ఈ నయా ఉదారవాద విధానాలపై పెద్ద ఎత్తున పోరాడాలని సీఐటీయూ అఖిలభారత కోశాధికారి సాయిబాబు పిలుపునిచ్చారు. పటాన్‌చెరులోని ఐలా భవన్‌లో తోషిబా పరిశ్రమలో సీఐటీయూ యూనియన్ స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'నయా ఉదార వాద విధానాలు– లేబర్ కోడ్‌లు– కార్మికుల కర్తవ్యాలు'అనే అంశంపై ఆదివారం జరిగిన సెమినార్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రధాని నరేంద్రమోదీ కార్మిక వ్యతిరేకి అన్నారు. మోదీ అనుసరిస్తోన్న ఆర్థిక విధానాలతో ప్రజలకు, కూలీలకు, కార్మికులకు ఎవరికీ ఉపయోగపడటం లేదని విమర్శించారు. మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, జిల్లా కోశాధికారి రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పాండు రంగారెడ్డి, యూనియన్ జనరల్ సెక్రటరీ అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగించాలి

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

అల్విన్‌కాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక వ్యక్తి కాదని శక్తి అని, ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్య నగర్ కమ్యూనిటీ హాల్‌లో శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్తలుగా ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ హాజరయ్యారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని తెలిపారు. డాక్టర్ సి.ఎల్. వెంకటరావు, డాక్టర్ రామ్ సింగ్ నాయక్, డాక్టర్ చంద్రశేఖర్, భరత్, డాక్టర్ జ్యోతి, అశోక్, రామరాజు, మణిభూషణ్, శ్రీనివాస్, సీతారామరాజు, వేణుగోపాల్ యాదవ్, అరుణ్‌కుమార్, నరసింహచారి, వసంత్ యాదవ్, శేషయ్య, కృష్ణంరాజు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించారు. శాంతినగర్ కాలనీలో రోడ్డు చిప్పింగ్ చేసి పైప్‌లైన్‌తో పాటు డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కార్పొరేటర్ కోరారు.

డిజిటల్ సేవలు అభినందనీయం

జిన్నారం (పటాన్‌చెరు): గ్రామాల్లో ఆధునిక డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని వర్లక సంఘం భవనంలో అయ్యప్ప కమ్యూనికేషన్ డిజిటల్ సేవా సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నేడు గ్రామగ్రామాన ఆధునిక డిజిటల్ సేవలు అత్యంత వేగవంతంగా విస్తరిస్తున్నాయని అన్నారు. యువత ఐటి రంగంలో ఆసక్తిగా ముందుకెళ్లడం గొప్పవిషయమన్నారు. మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు సదానందరెడ్డి, మోహన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సభ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కొడకంచి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు జయలక్ష్మి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు మండల ఇన్‌చార్జి ఎంఈఓ కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందన్నారు. జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి తెలిపారు. విద్యాభివృద్ధికి జయలక్ష్మి చేసిన సేవలు కొనియాడారు. అనంతరం ఎంఈఓ ఉపాధ్యాయులతో కలిసి జయలక్ష్మి దంపతులను సన్మానించారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన





మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నారాయణీ నాట్యాలయ గురువు సంతోష్‌కుమార్ తమాంగ్ తన శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. పుష్పాంజలి, విఘ్నేశం అలరిపు, శబ్దం, పదవర్ణం, నటనం ఆదినార్, నందిచోల్, క్షేత్రయ్య పదం, తిల్లాన తదితర అంశాలను కళాకారులు వీరింద, శాన్వి, సహస్ర, అంకిత, సోమా, ఉర్విజ, ఐశ్వర్య, ఇషితా, మోహన, రుచిత, హరిణి, భావన ప్రదర్శించి సందర్శకులను అలరించారు.

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

రాజేంద్రనగర్: వేద పండితులు, ఒగ్గు కళాకారుల మంత్రోచ్ఛరణల మధ్య హైదర్‌గూడ శ్రీ మల్లికార్జున స్వామి అష్టమ కల్యాణ మహోత్సవం ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వివిధ రకాల పూలు, పండ్లతో పాటు రంగురంగుల విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. శనివారం రాత్రి గణపతి పూజ, స్వామి వారి అభిషేకం, గంగ తిప్ప మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా హాజరయ్యారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య గంగ తెప్ప, బోనాల ఊరేగింపు కన్నుల పండుగగా సాగింది. గౌరెల్లి నాగేశ్ అన్నదానం చేశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో పాటు నాయకులు, కార్యకర్తలు, భక్తులు బండారు నారాయణ, ఎగ్గే మల్లేశం, మోంద్రా నరసింహ, నారగూడెం మల్లా రెడ్డి, రామేశ్వర్ రావు, శేఖర్ రెడ్డి, కొమురయ్య, నల్లింగ్ రమేశ్, సాబదా విజయ్, సులిగే వెంకటేశ్‌తో పాటు మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, రాజేంద్రనగర్ కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి, మోంద్ర సంగీత, అర్చన, కల్యాణ మహోత్సవ కమిటీ ప్రతినిధులు క్యాడం నర్సింగ్‌రావు, కొంగళ్ల ప్రసాద్, నల్లింగ్ రాజు, మహేందర్, బీట్కారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం కార్యవర్గం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కురుమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గండిపేట మండల కురుమ సంఘం అధ్యక్షుడు ఇ.యాదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల అధికారులుగా సంఘం చైర్మన్ బి.జైహింద్‌రావు, వైస్ చైర్మన్ బి.మల్లేష్ వ్యవహరించారు. సంఘం అధ్యక్ష పదవికి పోటీకి ముగ్గురు పోటీపడగా డి.బాబు, బి.శంకర్, సి.బీరప్పలు పోటీపడ్డారు. దీంతో ముగ్గురి పేర్లను లాటరీ ద్వారా ఎన్నుకున్నామన్నారు. కురుమ సంఘం అధ్యక్షుడిగా చిలుకూరి బీరప్ప, ప్రధాన కార్యదర్శిగా ఇ.వెంకటేష్, కోశాధికారిగా ఎన్.గణేష్, కార్యవర్గ సభ్యులుగా జె.లక్ష్మయ్య, బి.శంకర్, బి.ఆంజనేయులు, బి.రమేష్, బి.రాజు, బి.అజయ్, జె.సిద్దప్ప, డి.లక్ష్మణ్‌తోపాటు వివిధ కమిటీల సభ్యులను ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు కొత్త కమిటీ కొనసాగుతుందని అధ్యక్షుడు వెల్లడించారు.

రజక సంఘం అధ్యక్షుడిగా సత్తయ్య

రాజేంద్రనగర్: బుద్వేల్ రజక సంఘం అధ్యక్షుడిగా పెండ్యాల సత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం బుద్వేల్‌లోని రజక సంఘం భవనంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సత్తయ్య మాట్లాడుతూ... బుద్వేల్ రజక సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో అధ్యక్షుడిగా ఎంపిక చేసుకున్నందుకు కమిటీ సభ్యులతో పాటు కుల సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ అధ్యక్షుడు పి.సురేందర్, నేతలు ఎం.కృష్ణ, డి.వెంకటేశ్, పి.నందం, ఎస్.రవి, శబద్ శ్రీనివాస్, పి.సంతోష్, పి.రాజు, పి.మహేందర్, పి.అరవింద్, జి.గోపికృష్ణ, పి.నర్సింగ్ రాజు, పి.దశరథ్, ఎల్.శ్రీధర్, పి.శ్రీనివాస్, పి.వినోద్, పి.కిరణ్, సి.యాదయ్య, ఎస్.మురళీ, పి.ప్రదీప్ పాల్గొన్నారు.

ఆలయ వార్షిక పూజలు

అల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ చైతన్యనగర్‌లోని నాగదేవత అమ్మవారి ఆలయ వార్షిక పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గ నాయకులు ఏకాంత్ గౌడ్, రంగారెడ్డి డీసీసీ ఉపాధ్యక్షులు విద్యాకల్పనలు అమ్మవారిని దర్శించుకొని పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నర్సయ్య, నాగమణి, జ్యోతి తదితరులు పాల్గొన్నార